# అధిక ఊగిసలాట




**సమీక్ష :** దేశీయంగా సానుకూల వార్తలు రావడం; విదేశీ సంస్థాగత మదుపుదార్ల(ఎఫ్‌ఐఐలు) నుంచి కొనుగోళ్లు పుంజుకోవడం వంటి కారణాల వల్ల గత వారం సెన్సెక్స్ 110 పాయింట్లు లాభపడింది. ఎం&ఎం, బీపీసీఎల్, హిందాల్కో వంటి ప్రధాన కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో మార్కెట్ ప్రతికూలంగానే ప్రారంభమైంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కిందకు దిగివచ్చినా లాభం లేకపోయింది. మరోవైపు 2010-11 ఏడాదికి జీడీపీ వృద్ధి గణాంకాలు బావుండడం; ఏప్రిల్‌లో మౌలిక, ద్రవ్యలోటు గణాంకాలు అనుకూలంగా ఉండడంతో మార్కెట్లో ర్యాలీ కనిపించింది. అయితే ఆర్థిక వృద్ధిపై తక్కువ అంచనాలు, అంతర్జాయ అనిశ్చితులు సెంటిమెంటుపై ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ 18376 వద్ద స్థిరపడింది. ఎఫ్‌ఐఐలు రూ.2474 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా.. ఫండ్లు కూడా రూ.404 కోట్ల మేర నికర కొనుగోళ్లు జరిపాయి.

**రంగాల వారీగా }** గత వారంలో మన్నికైన వినిమయ వస్తువులకౌంటర్లపై మదుపర్లు తమ ఆసక్తిని కొనసాగించారు. ముందుగానే రుతుపవనాలు భారత తీరాన్ని తాకాయన్న వార్తల మధ్య ఎఫ్ఎమ్‌సీజీ స్క్రిప్‌లు వెలుగులోకొచ్చాయి. ఆరోగ్య సంరక్షణ రంగమూ రాణించింది. వాహన, చమురు-గ్యాస్, లోహ షేర్లలో విక్రయాల ఒత్తిడి కనిపించింది.

**శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా ఉండడం చూస్తే ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లు జరిగాయని తెలుస్తోంది.**

**ఈవారం అంచనా }** ప్రస్తుతం మార్కెట్లో కొంచెం హుషారు కనిపిస్తోంది. అంతర్జాతీయ ధోరణులు, రుతుపవనాల ప్రగతిపై స్వల్పకాల ఊర్ధ్వముఖ గమనం ఆధారపడి ఉంది. ఏదైనా ర్యాలీ వస్తే సెన్సెక్స్‌కు 60 రోజుల చలన సగటు(డీఎమ్ఏ) 18712 వద్ద బలమైన నిరోధం ఎదురుకావచ్చు. ఒకవేళ సెన్సెక్స్ 18021 కంటే దిగువన ముగిస్తే మాత్రం స్వల్పకాలంలో మరింత బలహీనతలను చవిచూడాల్సి రావచ్చు.

**ప్రభావిత అంశాలు }** వరుసగా రెండో వారమూ ఎఫ్‌ఐఐలు నికర కొనుగోలుదార్లుగా ఉన్నారు. ఈ ధోరణి కొనసాగితే మదుపర్ల సెంటిమెంటు మెరుగవుతుంది. గురువారం సమావేశం అవుతుందని భావిస్తున్న సాధికార మంత్రుల బృందం(ఈజీఓఎమ్) డీజిల్, ఎల్‌పీజీ, కిరోసిన్‌ల ధరలను పెంచితే చమురు మార్కెటింగ్ కంపెనీల స్క్రిప్‌లలో కొనుగోళ్లు కనిపించవచ్చు. శుక్రవారం విడుదల కానున్న ఐఐపీ గణాంకాలు బావుంటే తక్కువ స్థాయిల వద్ద మద్దతు లభించొచ్చు. ఆహార ద్రవ్యోల్బణం, రుతుపవనాల ప్రగతి స్వల్పకాలంలో మార్కెట్‌కు దిశానిర్దేశం చేయొచ్చు. అంతర్జాతీయంగా యూరోజోన్ రుణ సంక్షోభం, ముడి చమురు ధరల కదలికలు, లోహ ధరలు సైతం ప్రభావితం చేయనున్నాయి.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 18237, 18021, 17786;

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18541, 18712, 18816

**గత కొద్ది రోజులుగా పరిమిత శ్రేణిలో కదలాడుతున్న మార్కెట్లో స్వల్పకాలంలో ఊగిసలాట అధికం కావొచ్చు.**

*-సతీశ్ కంతేటి, జెన్ మనీ*